క్లుప్తంగా

బీజేపీ కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: బీజేపీ చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు పీక వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా గుంటోజు నాగచారి(పెద్దకాపర్తి), ఉయ్యాల లింగస్వామి(ఉరుమడ్ల), గడిగల కోటేష్(ఎలికట్టె), నర్రా మాధవి(వట్టిమర్తి), ప్రధాన కార్యదర్శులుగా గరిషే నరేష్(గుండ్రాంపల్లి), పున్న విష్ణు(పెద్దకాపర్తి), కార్యదర్శులుగా బుంగ రాజేందర్(సుంకెనపల్లి), ఆకుల వెంకన్న(చిన్నకాపర్తి), కొత్రబోయిన హేమలత(ఉరుమడ్ల), వరికుప్పల నర్సింహ(నేరడ), కోశాధికారిగా సిద్దగోని అశోక్(వెంబాయి)లు ఎన్నికయ్యారు.

తిప్పర్తి : బీజేపీ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నుకున్నట్లు తిప్పర్తి మండల బీజేపీ అధ్యక్షుడు వంగూరి రవి బుధవారం తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా నల్లబోతు రమేష్, ఉప్పల శోభారాణి, పాపకంటి సతీష్, సందీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నకిరెకంటి మహేష్, దర్శబోయిన గంగాధర్, యాదగిరి, కార్యదర్శులుగా శంకర్, కళ్యాణ్, మాధవరెడ్డి, మౌనిక, కోశాధికారిగా గంటెకంపు నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా నేదునూరి శ్రీనివాస్, బత్తిని మహేష్, సింగం గణేశ్, కంచర్ల శ్రీధర్ రెడ్డి, వాసులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఛాయాదేవి

తిప్పర్తి : మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి బుధవారం పరిశీలించారు. ప్రత్యేక అవసరాల పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రం ఎమ్మార్సీ భవనంలో నిర్వహిస్తున్నారని, ఈ కేంద్రానికి ప్రత్యేక భవనం ఏర్పాటు చేయడం కోసం పరిశీలించినట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి తదితరులు ఉన్నారు.

వీపీఓకు రివార్డు



రివార్డు అందుకుంటున్న గిరిబాబు

నార్కట్‌పల్లి : చోరీకి గురైన 21 ద్విచక్ర వాహనాలను పట్టుకున్న అక్కెనపల్లి విలేజ్ పోలీస్ ఆఫీసర్ బండి గిరిబాబును ఎస్పీ శరత్‌చంద్ర పవర్ బుధవారం అభినందించి రివార్డు అందించారు. విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేయడం అభినందనీయమన్నారు.

ఉత్తమ విలేజ్ పోలీస్ ఆఫీసర్‌గా గీత



ప్రశంసాపత్రం అందుకుంటున్న గీత

మర్రిగూడ: ఉత్తమ విలేజ్ పోలీస్ ఆఫీసర్‌గా మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ టి.గీత ఎంపికైంది. మండలంలోని దామెరభీమనపల్లి గ్రామంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌గా టి.గీత విధులు నిర్వర్తిస్తున్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించినందుకుగాను గీత ఉత్తమ విలేజ్ పోలీస్ ఆఫీసర్‌గా ఎంపికైంది. బుధవారం నల్లగొండలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ చేతులమీదుగా గీత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గీతను సీఐ రాజు, ఎస్‌ఐ కృష్ణారెడ్డి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మర్రిగూడ : మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు తిరగండ్లపల్లి, 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వట్టిపల్లి, బట్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు: గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు పందుల యాదయ్యను బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు భవనం మధుసూదన్‌రెడ్డి, మాదగోని నరేందర్‌గౌడ్, బండారి యాదయ్య, కంభంపాటి నర్సింహ, అక్కనపల్లి సతీష్, కర్నాటి శేఖర్, కొండ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రమాదకరంగా ఓపెన్ డ్రైనేజీలు

- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు
- స్లాబ్ ఏర్పాటు చేయాలని వేడుకోలు

చిట్యాల : మున్సిపాలిటీలోని పలువార్డులో ఓపెన్ డ్రైనేజీలు ప్రమాదకరంగా మారాయి. చిట్యాల పట్టణంలో వరదనీరు వెళ్లేందుకుగాను గతంలో వెడల్పుగా నిర్మించిన పలు డ్రైనేజీలపై కప్పు ఏర్పాటు చేయకపోవడంతో అవి ప్రాణాలమీదకు దారితీస్తున్నాయి. దీంతో పాదచారులతో పాటు వాహనదారులు ఈ ఓపెన్ డ్రైనేజీల వెంట ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ ఓపెన్ డ్రైనేజీలలో ఇటీవల ప్రమాదవశాత్తు ఇద్దరు పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ప్రాణాలు తీస్తున్న డ్రైనేజీలు..

చిట్యాల మున్సిపాలిటీలోని 10వవార్డు (ముత్యాలమ్మగూడెం)లో 15ఏళ్ల క్రితం సుమారుగా కిలోమీటర్ దూరం మేర ఓపెన్ డ్రైనేజీని వార్డులోని మురుగునీటితో పాటు వర్షపు నీరు వెళ్లేందుకుగాను నిర్మించారు. ఆ వార్డులోని వరద నీరు ఎప్పుటికప్పుడు పోయేట్లుగా (కొత్త శివనేనిగూడెం రోడ్డు నుంచి పాత శివనేనిగూడెం రోడ్డులోని ఎల్లమ్మగుడి వరకు) ఈ ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఆ డ్రైనేజీ సీసీరోడ్డు వెంట ఉండడంతో వాహనదారులు, పాదచారులు ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే వారికి, అప్రమత్తతో వెళ్లని చిన్నారులకు మరింత ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని 7వ వార్డులో సైతం మసీదు నుంచి భాగ్యనగర్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన ఇళ్లలోని మురుగునీరుతో పాటు వరద నీరు పోయేందుకుగాను నిర్మించారు. అదే విధంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ప్రహరీని ఆనుకుని భువనగిరి రోడ్డు నుంచి హైవే రోడ్డు వరకు ఇటీవల ఓపెన్ డ్రైనేజీని నిర్మించారు. దీంతో ఈ రోడ్డుపై రెండు ఎదురెదురుగా వాహనాలు ప్రయాణించే సమయంలో వాహనదారులు అందులో పడిపోతామని భయభ్రాంతులకు గురవుతున్నారు. చిట్యాల పట్టణంలోని 4వ వార్డులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో, శ్రీవేణుగోపాలస్వామి కాలనీలో ఓపెన్ డ్రైనేజీ నిర్మాణాలున్నాయి. గత ఏడాది 10వ వార్డులో ఎల్లమ్మగుడి సమీపంలోని ఓపెన్ డ్రైనేజీలో ఎండీ.జావీద్, వేణుగోపాలస్వామి వెంచర్‌లోని ఓపెన్ డ్రైనేజీలో మేకల భిక్షం ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఓపెన్ డ్రైనేజీలపై స్లాబ్‌లతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.



చిట్యాల పట్టణంలోని 10వ వార్డులో ఓపెన్ డ్రైనేజీ



4వ వార్డులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ డ్రైనేజీ

డ్రైనేజీలపై స్లాబ్ నిర్మించాలి



మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇళ్లలోని మురునీరుతో పాటు వరద నీరు వెళ్లేందుకుగాను వెడల్పాటి డ్రైనేజీలు నిర్మించారు. సీసీరోడ్డు పక్కన నిర్మించి వెడల్పాటి డ్రైనేజీలపై రక్షణ లేకపోవడంతో ప్రయాణించాలంటే భయంగా ఉంటోంది. అంతేకాకుండా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు నిధులు మంజూరు చేసి ఓపెన్ డ్రైనేజీలపై రక్షణగా స్లాబ్‌ల నిర్మాణం చేపట్టాలి.

– బొల్లూరి సైదులు, చిట్యాల

మున్సిపాలిటీలో నిధులు లేవు



పట్టణంలోని 10, 7, 5వ వార్డుల్లో ఓపెన్ డ్రైనేజీలున్నాయి. వీధుల్లోని, ఇళ్లలోని మురుగునీరు, వర్షపు నీరు వెళ్లేందుకుగాను ఓపెన్ డ్రైనేజీలను చిట్యాల గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించారు. ప్రస్తుతం ఓపెన్ డ్రైనేజీలపై రక్షణగా పైకప్పులు వేసేందుకు మున్సిపాలిటీలో ఎలాంటి నిధులు లేవు. నిధులు సమకూరిన అనంతరం ఓపెన్ డ్రైనేజీలపై స్లాబ్‌ల నిర్మాణాలు చేపడతాం.

– దండు శ్రీను, మున్సిపల్ కమిషనర్, చిట్యాల

మునుగోడును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి రాష్ట్రంలోనే మునుగోడును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకులతో మునుగోడు అభివృద్ధిపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్‌శాఖ సీఎండీ ముషరఫ్‌ని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా రోడ్ల అభివృద్ధికి, మంచి నీటి సమస్య పరిష్కారానికి నిత్యం సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

డీజీపీకి ఫోన్ చేసిన ఎమ్మెల్యే..

చండూరు డివిజన్ ఏర్పాటైనప్పటికీ నేటికీ డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయలేదని.. వెంటనే చండూరులో డీఎస్పీ కార్యాలయం మంజూరు చేసి ప్రారంభించాలని డీజీపీకి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫోన్‌చేసి కోరారు. అదేవిధంగా గట్టుప్పల్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి మూడు ఏళ్లు గడిచినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసే అవకాశం ఇవ్వలేదని, ఎఫ్‌ఐఆర్ చేసే అధికారం స్టేషన్ ఎస్‌ఐకి ఇవ్వాలన్నారు. మునుగోడు నుంచి కొరటికల్ గ్రామానికి వెళ్లే రోడ్డు పట్టణంలోని బట్లకాల్వ వద్ద అసంపూర్తిగా వేశారని, వెంటనే ఆ పనులు పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఈఈ, డీఈలకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నిరుపయోగంగా నీటి తొట్టి

చిట్యాల : వేసవి కాలంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. పెద్దకాపర్తి గ్రామ శివారులోని తిరుమలనాథ స్వామి గుట్ట సమీపంలో నిర్మించిన నీటి తొట్టిలో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో ఆ నీటి తొట్టి నిరుపయోగంగా మారింది.



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తాను దత్తత తీసుకున్న నకిరేకల్ మండలంలో నెల్లిబండ గ్రామంలో బుధవారం ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోసుకున్న వారి ఖాళీ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో 3500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటి విడతలో అన్ని గ్రామాల్లో అర్హులైన పేదల జాబితా రూపొందించామన్నారు. తాను దత్తత తీసుకున్న నెల్లిబండ గ్రామంలో 44 ఇళ్లు మంజూరు చేసి ముగ్గు పోసి పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ జమురుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఎ.స్వాతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, మాజీ ఎంపీటీసీ యానాల శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మస్కు పాపమ్మ పుల్లయ్య, మాజీ ఉప సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మణ్, లింగమంతుల స్వామి ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



మోక్షసాయిసంజన

నల్లగొండ: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని మోక్షసాయి సంజన 500 మార్కులకు 489 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ పార్థసారధి తెలిపారు. శ్రీఆమని మ్యాథ్స్‌లో 100కు 100, ఐటీలో ఏడుగురు 100కు 100 మార్కులు సాధించారని పేర్కొన్నారు. తమ స్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు జగిని భీమయ్య, డి.అమరేందర్‌రావు, పి.వెంకట్ నారాయణలు అభినందించారు.

విద్యాపీఠం స్కూల్ విద్యార్థుల విజయకేతనం



భరత్‌సాయి



శ్రీవల్లి

నార్కట్‌పల్లి : సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నార్కట్‌పల్లికి చెందిన విద్యాపీఠం స్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. 500 మార్కులకు గాను 486 మార్కులతో ఎస్.శ్రీవల్లి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. వి.భరత్ సాయి 478, కెఎ.అశ్విన్‌రెడ్డి 470, కె.రేణుయశోధన్‌రెడ్డి 470, వి.సాతేంద్ర 469 మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 92 శాతంకు పైగా మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సుస్మిత తెలిపారు.

సత్తాచాటిన విపస్య విద్యార్థులు



ఎ.శ్రీచందన



కె.సాయిచరణ్



బి.తనుష్

నల్లగొండ: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో విపస్య స్కూల్‌కు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన బండారు తనుష్ 600 మార్కులకు 563, పిన్నపురెడ్డి శ్రీచందన 550 మార్కులు, కందగట్ల సాయిచరణ్ 537 మార్కులు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఫలితాల్లో తమ స్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 60 శాతం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించాలి

గట్టుప్పల్ : ప్రభుత్వం 1999వ సంవత్సరంలో కొనుగోలు చేసిన ఆరు ఎకరాల భూమికి హద్దులు చూపించాలని కోరుతూ గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో యువకులు బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి ఆరు ఎకరాల భూమిని 56, 57 సర్వే నంబర్‌లో కొనుగోలు చేసిందన్నారు. కానీ అధికారులు పేదలకు 55 సర్వే నంబర్‌లో తప్పుడుగా పొజిషన్ ఇచ్చారన్నారు. ఆ భూమి పేదలకు పంపిణీ చేయకపోవడంతో ఆక్రమణకు గురవుతోందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నామన్నారు. బుధవారం డీఐ సర్వే చేసినప్పటికీ హద్దులు చూపించలేదని అన్నారు. ప్రభుత్వ భూమిని రక్షించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. భూమికి హద్దులు చూపించే వరకు దీక్షలు విరమించేది లేదని యువకులు స్పష్టం చేశారు.



రిలే దీక్షలు చేస్తున్న యువకులు

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న జానిమియా

కేతేపల్లి : ఎరువులు, పురుగు మందుల డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, మందులు సరఫరా చేయాలని నకిరేకల్ ఇన్‌చార్జ్ వ్యవసాయ సంచాలకులు ఎండీ జానిమియా సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల విత్తన డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచి ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని ఆదేశించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్స్, స్టాక్ రిజిస్టర్ రోజువారీగా నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను తప్పనిసరిగా ఈపీఓఎస్ ద్వారా అమ్మాలని ఆదేశించారు. ఎరువుల వాస్తవ స్టాక్‌కు, ఈపీఓఎస్ మెషిన్ స్టాక్‌కు ఎలాంటి తేడాలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. రైతులు అనుమతి ఉన్న విత్తనాల దుకాణాల్లో కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ పురుషోత్తం, ఏఈఓ నాగరాజు, డీలర్లు ఉన్నారు.

జూనియర్ కళాశాలకు భవనం పరిశీలన

తిప్పర్తి : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం ప్రైవేటు భవనాన్ని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దాసరి రాజశేఖర్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిప్పర్తికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని, సొంత భవనం నిర్మాణం ఆలస్యం కావడంతో అప్పటివరకు తాత్కాలికంగా ప్రైవేటు భవనంలో కళాశాల ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకురి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, బద్దం సుధీర్, కిన్నెర అంజి, అబ్దుల్ రహీం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ భవనాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నల్లగొండ టౌన్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి, లెనిన్, గుండె రవి, ఎండీ జానీ, టి.సత్యనారాయణ, మహేష్, జి.నరేందర్, చింత భిక్షం, అశోక్, అక్కలయ్య పాల్గొన్నారు.

చండూరు : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ధనుంజయ డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరుగనున్న దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు సైదులు, లింగస్వామి, నాగరాజు, కలమ్మ, అలివేలు, రవమ్మ, చంద్రమ్మ, రమేష్, రేణుక, ముత్తమ్మ, ఎల్లమ్మ, రజిత, బక్కమ్మ, యాదయ్య, రాజు, వెంకన్న, కృష్ణయ్య, సుధాకర్, రామచంద్రం, నర్సింహ పాల్గొన్నారు.

నకిరేకల్ : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వంటిపాక వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 20న అన్ని కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రూపొందించిన ప్రచార పోస్టర్‌ను బుధవారం ఆయన నకిరేకల్‌లో విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తాడ్వాయి రాములు, సూరారపు వీరయ్య, కృష్ణ, మల్సూర్, బాతుక సైదులు, హఫీజ్, వంటిపాక నాగార్జున, జిల్లా నర్సింహ, ఎడ్ల రాములు, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదయ్య మృతికి సంతాపం

గట్టుప్పల్ : మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) ఎన్‌డీఆర్ నాయకుడు వనం యాదయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేక రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి అనంతరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జంట నగరాల కార్యదర్శి విజయ్, ఐఎఫ్‌టీయూ నాయకుడు పంగ అంజయ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి, నాయకులు జన్నె మల్లేష్, బాలం యాదయ్య, వల్లూరి మల్లేష్ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ జమీరుద్దీన్

నకిరేకల్ : మండలంలో పది రోజులపాటు నిర్వహించిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన సదస్సులో తహసీల్దార్ జమీరుద్దీన్ పాల్గొని మాట్లాడుతూ భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ నెల 30లోగా వాటికి పరిష్కారం చూపుతామని తెలిపారు. చివరి రోజు నకిరేకల్‌లో జరిగిన సదస్సులో 138 దరఖాస్తులు స్వీకరించామన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 1013 దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ యశ్వంత్, ఆర్‌ఐలు చిరంజీవి, బోళ్ల శ్యాం పాల్గొన్నారు.

నిరంతర పోరాటాలు కొనసాగిస్తాం

చిట్యాల: పేదల ప్రజలకు అండగా ఎర్ర జెండా నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో బుధవారం జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీమ అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు బొడిగె సైదులుగౌడ్, మండల కార్యదర్శి అక్బర్, గ్రామ కార్యదర్శి జిల్లా సత్యం, సహాయ కార్యదర్శి కేతరాజు అంజయ్య, బొడిగె బక్కశెట్టి, జిల్లా యాదయ్య, గోపగోని శేఖర్, జిల్లా లింగస్వామి, శివ, నమ్ముల స్వామి, అశోక్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా వడ్డె రమేష్

మర్రిగూడ : తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు(143) మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు గాలెంక గురుపాదం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వడ్డె రమేష్(సాక్షి) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా గునగంటి యాదయ్య, సంయుక్త కార్యదర్శిగా కుక్కల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా ఏర్పుల శ్రీశైలం, ప్రచార కార్యదర్శిగా తుప్పరి రఘు, కోశాధికారి ఎండీ.అబ్దుల్ రజాక్, కార్యవర్గ సభ్యులుగా ప్రకాశ్, అర్నాల్, మహేందర్‌లు ఎన్నికయ్యారు.

కబ్జా భూమి స్వాధీన పనులు ముమ్మరం

- అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు
- ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే

మునుగోడు: మండల కేంద్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే పనులు అధికారులు వేగవంతం చేస్తున్నారు. మునుగోడులో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలతోపాటు ఇతర అవసరాలకు అవసరమైన భూమి లేకుండా పోయింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మండల కేంద్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 78 ని గుర్తించి ఆ భూమి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠితోపాటు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు చండూరు ఆర్డీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఆ భూమి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

అనేకమార్లు సమీక్షలు జరిపిన ఎమ్మెల్యే..

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు... ఆ పనులు ఎంతవరకు వచ్చాయనే విషయమై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అధికారులతో అనేకమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆ భూమిని రెండు, మూడుమార్లు స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ భూమి స్వాధీనమైన అనంతరం ప్రభుత్వం మండలానికి మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులకు ఎమ్మెల్యే తెలిపారు.

దాదాపు 20 ఎకరాలు కబ్జా

మునుగోడు మండల కేంద్రంలో సర్వే నంబర్ 78లో 150 ఎకరాల 33 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. అందులో దాదాపు 20 ఎకరాలకు పైగా మర్రివాగు ఉంది. 6 ఎకరాల్లో బృహత్ ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. మిగిలిన దానిలో ఒక ఎకరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మరో ఎకరంలో లారీ ఆఫీసు, 3 ఎకరాల్లో కస్తూరిబా పాఠశాల ఉన్నాయి. 1980లో 5 ఎకరాల 10 గుంటల భూమి పేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చారు. ఇటీవల ఎకరం 20 గుంటల భూమి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేటాయించారు. అదేవిధంగా చేనేత భవనానికి 20 గుంటల భూమి కేటాయించారు. దాదాపు 90 ఎకరాల వరకు భూమిని నిరుపేదలకు వ్యవసాయం చేసుకునేందుకు అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. 20 ఎకరాలు వరకు వాగు ఉంది. ఇలా అవన్నీ కలిపి మొత్తం 128 ఎకరాల భూమి వివిధ రూపాల్లో అధికారులు కేటాయించినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. ఇంకా 22 ఎకరాల 33 గుంటల భూమి ఎవ్వరికి పట్టాలు ఇవ్వలేదు. కానీ ఆ భూమిని కొందరు కబ్జాచేసి సాగు చేసుకుంటున్నారు. మరికొందరు అక్రమంగా కట్టడాలు కట్టారు. వాటి గుర్తించిన అధికారులు ఇప్పటికే 8 ఎకరాలకుపైగా స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన భూమిని కూడా స్వాధీనం చేసుకునేందుకు స్థానిక పోలీసుల సహకారంతో ప్రయత్నాలు చేస్తున్నారు.



అక్రమ కట్టడాలను జేసీబీతో తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కబ్జాలను తొలగిస్తున్నాం



సర్వే నంబర్ 78లో దాదాపు 20 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేశారు. ప్రస్తుతం ఆ కబ్జాలను తొలగిస్తున్నాం. రెండు నెలలుగా కబ్జాకు గురైన భూమిని గుర్తించేందుకు నాలుగు టీమ్‌ల ద్వారా సర్వే చేయించాం. త్వరలో పూర్తిస్థాయిలో కబ్జాలను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– ఎస్.నరేష్, తహసీల్దార్